## క్లుప్తంగా

### హామీలు అమలయ్యేదెన్నడు?



మాట్లాడుతున్న దోల వెంకటరమణ

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దోల వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం మెట్టవలసలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు అందక అర్హులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు నిధులు లేవంటూ చేతులెత్తేయడం దారుణమన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, డకర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుల సేవలో..



నివాళులు అర్పిస్తున్న మిత్ర బృందం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్న వృద్ధులకు ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ సభ్యులు మంగళవారం అల్పాహారం, మామిడిపండ్లు, వాటర్ బాటిల్స్ వితరణగా అందజేశారు. తమ స్నేహితులు మట్ట మహేష్‌కుమార్, పరిటాల ప్రభాకర్‌ల మృతికి నివాళిగా వీరికి సేవలు అందించారు.

### అంధకారంలో ఆర్.కె.నగర్‌కాలనీ



చీకటిమయంగా కాలనీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఆర్.కె. నగర్‌కాలనీ అంధకారంలో మగ్గుతోంది. పది రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో సాయంత్రం నుంచే చీకట్లు అలుముకుంటున్నాయి. పక్కనే ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు రాకపోకలు సాగిస్తూ కొందరు దొంగతనాలకు సైతం పాల్పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం



సాయిమోహినిని సన్మానిస్తున్న ఎయిమ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసు పరీక్షల ఫలితాల్లో 975వ ర్యాంక్ సాధించిన జిల్లాకు చెందిన దళిత యువతి డాక్టర్ రావాడ సాయిమోహిని మానసకు సీనియర్ ఐపీఎస్ అధికారి, ఎయిమ్ వ్యవస్థాపకులు పి.వి.సునీల్‌కుమార్ సత్కరించారు. ఎయిమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, దళిత సంఘాల జేఏసీ నాయకులు కంఠ వేణు ఆధ్వర్యంలో విశాఖపట్నంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిమ్ నాయుకులు అప్పారావు, చిన్నదేముడు, రాజశేఖర్, భోగేష్ పాల్గొన్నారు.

### వేసవి శిబిరాలతో విజ్ఞానం



నీతికథలు చెబుతున్న లైబ్రేరియన్

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు, చిన్నారులలో విజ్ఞానం పెంపొందించడం కోసమే వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు బలగ శాఖా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు. మంగళవారం చిన్నారులకు యోగాసనాలు నేర్పించారు. అనంతరం నీతికథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్వారీ పరిశీలన



కొంగరాంలో క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ముద్దాడ, కొంగరాం గ్రామాల పరిధిలో గ్రానైట్ క్వారీని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, తహసీల్దార్ బి.గోపాలరావు, ఎస్సై వి.సందీప్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం క్వారీ నిర్వహించకపోయినా స్థలం, లీజు తదితర వివరాలపై ఆరా తీశారు.

# రేషన్‌కార్డులకు.. సర్వర్ సమస్య

- సచివాలయాల వద్ద తప్పని నిరీక్షణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తుదారుల పాట్లు
- పట్టించుకోని ప్రభుత్వం

| మండలం | రేషన్ షాపులు | రేషన్ కార్డులు |
|---|---|---|
| రణస్థలం | 73 | 27,879 |
| ఎచ్చెర్ల | 60 | 27,463 |
| లావేరు | 58 | 21,457 |
| జి.సిగడాం | 50 | 17,587 |



ఎచ్చెర్లలో సర్వర్లు పనిచేయక పాట్లు పడుతున్న ఉద్యోగి

ఎచ్చెర్ల క్యాంపస్ : రేషన్ కార్డులు ఇచ్చేస్తున్నామంటూ హడావుడిగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం .. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత సమయంలో కార్డు మంజూరవుతుందంటూ మంత్రులు, అధికారులు చెబుతున్నా.. అసలు నమోదే కావడం లేదంటూ దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరీక్షిస్తున్నా సర్వర్ పనిచేయడం లేదంటూ సిబ్బంది చెబుతున్నారని వాపోతున్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు.

**తప్పని పాట్లు..**

పేద కుటుంబాలకు తెల్లరేషన్ కార్డు ఎంతో కీలకం. ఏ ప్రభుత్వ పథకం వర్తింపజేయాలన్న రేషన్ కార్డు తప్పనిసరి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లను సంప్రదిస్తే చాలు సకాలంలో రేషన్‌కార్డు ఇంటికొచ్చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఏడాది కావస్తున్నా సూపర్‌సిక్స్ హామీలు గానీ, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా కాలయాపన చేసిన ప్రభుత్వం ఇటీవల రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది.

**వెంటాడుతున్న ఇబ్బందులు..**

పేర్లు యాడింగ్, కొత్తగా వివాహం జరిగిన వారు, కార్డుల విభజన కోరుతూ సచివాలయాలకు వెళ్తే సర్వర్లు పనిచేయపోవటం, ఇంటర్నెట్ సమస్య, కంప్యూటర్ల మొరాయింపు, ఆధార్‌లో తప్పులు, రేషన్ కార్డులో వయస్సు, ఆధార్ వయస్సులో తేడా కనిపించడం, ఈకేవైసీ సమస్య వంటివి వెంటాడుతున్నాయి. దరఖాస్తు సక్రమంగా ఉంటే మూడు దశలు వెరిఫికేషన్ పూర్తిచేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాల్సి ఉంది. వీఆర్వో, ఆర్ఐ, డీటీ ఇలా వెరిఫికేషన్ పూర్తయ్యాక తహశీల్దార్ కార్డు మంజూరు చేస్తారు. మరో పక్క ఈకేవైసీ లాగిన్ వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఇచ్చారు. సర్వర్లు సక్రమంగా పనిచేయపోవటం, మధ్యాహ్నం సర్వర్లు పనిచేసే సమయంలో సచివాలయ ఉద్యోగులు టెలీ కాన్ఫరెన్సుల్లో ఉండటంతో రేషన్‌కార్డుల దరఖాస్తులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. వాట్సాప్ గవర్నెన్స్ అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం సేవలు అందించడం లేదు.

**సర్వర్లు పనిచేయడం లేదు..**



రేషన్ కార్డులు దరఖాస్తు సమయంలో సర్వర్లు ప్రధాన సమస్యగా ఉన్నాయి. సర్వర్లు పనిచేయకపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పని జరగడం లేదు. అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి సమస్య పరిష్కరించాలి.

– రాజేష్, ఎస్ఎంపురం

**నిబంధనలు కఠినం..**



రేషన్‌కార్డు దరఖాస్తు చేయడంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఈకేవైసీ, ఆధార్‌లో తప్పులు, వయస్సులో తేడాలు తదితర సమస్యలు వెంటాడుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటలు వరకే సర్వర్లు సక్రమంగా పనిచేస్తున్నాయి. ఈ సమయంలో సచివాలయ సిబ్బందికి వర్కులోడ్ ఉంటోంది.

– రవివర్మ, ఎచ్చెర్ల

**చర్యలు తీసుకుంటాం..**

దరఖాస్తు సమయంలో వస్తున్న సమస్యలపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల్లో సిబ్బంది సైతం దరఖాస్తుదారులకు సహకరిస్తున్నారు.

– బి.గోపాలరావు, తహశీల్దార్, ఎచ్చెర్ల

### ఘనంగా గ్రామదేవత ఉత్సవం



గార మండలం రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో చెవిటమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఇంటికొక ఘటంతో బయలుదేరి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బిందెల డ్యాన్సు, చిన్నారుల గరిడీ వంటి ప్రదర్శనలు అలరించాయి. కళింగపట్నం పంచాయతీ సిలగాంలోనూ గ్రామదేవత ఉత్సవంగా ఘనంగా జరిగింది. –గార

### భద్రమ్మ తల్లికి అలంకరణ



బలగలో భద్రమ్మతల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వారాలు సందర్భంగా అమ్మవారి సేవకుల ఆధ్వర్యంలో ముగ్రాట్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. – శ్రీకాకుళం కల్చరల్

# కార్మిక హక్కులను కాలరాయొద్దు




నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

రణస్థలం/ఎచ్చెర్ల క్యాంపస్: కార్మిక, ఉద్యోగ హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రామతీర్థాలు కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లపై పనిభారం తగ్గించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.కాంతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు. కార్మికుల హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, కార్మిక యూనియన్ నాయకులు సత్యనారాయణ, రామప్పుడు, రమణ పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన



జలమయమైన పాలకొండ రోడ్డు



కాంప్లెక్స్‌లో నీటిలోనే బస్సులు



కింతలిమిల్లు సమీపంలో సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల క్యాంపస్: కొన్నిరోజులుగా ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన జనాలకు మంగళవారం కురిసిన వర్షం ఉపశమనం ఇచ్చింది. కుండపోతగా కురిసిన వర్షం ధాటికి శ్రీకాకుళం నగరంలోని ప్రధాన కూడళ్లు, కాలనీలు జలమయమయ్యాయి. ఫారెస్టాఫీసు రోడ్డు, రైతుబజారు కూడలి, కృష్ణాపార్కు, సరస్వతి మహల్ కూడలి, రామలక్ష్మణ కూడలి, బ్యాంకర్స్‌కాలనీ, ఇందిరానగర్‌కాలనీ, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, డే అండ్ నైట్, గుజరాతిపేట, కిన్నెర థియేటర్ రోడ్డు, కళింగరోడ్డు, అరసవల్లి మిల్లు జంక్షన్‌లు నీటితో నిండిపోయాయి. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ జలమయమైంది. వర్షపునీటికి మురుగు కాలువ నీరు కూడా తోడవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. బస్సులు ఎక్కేందుకు ప్రయాసపడ్డారు. మరోవైపు ఎచ్చెర్ల పరిధిలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. కింతలిమిల్లు, జరజాం, ఎచ్చెర్ల, చిలకపాలెం, నవభారత్ తదితర ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులుపడ్డారు.

### పంటల మద్దతు ధరకు చట్టం చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతుల జిల్లా అధ్యక్షుడు రమణ

జి.సిగడాం: రైతులు పండించే ప్రతి పంట కోసం ప్రభుత్వం మద్దతు ధర చట్టాన్ని చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జి.సిగడాం తహసీల్దార్ ఎం.సరితకు వినతిపత్రం అందించారు. పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో మద్దతు ధర కోసం చట్ట సభలో చట్టాన్ని చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద వెంటనే రూ.20 వేలను రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో బొల్లి రమణ, కె.అప్పారావు కె.చంద్రరావు టి.చంటి పాల్గొన్నారు.

# తేనెటీగలతో జీవ వైవిధ్యం



తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

రణస్థలం: తేనెటీగలు లేకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మంగళవారం కోష్ట పంచాయతీ పరిధిలోని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నర్సరీలో రైతులకు తేనెటీగల ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరాగసంపర్క కీటకాకర్షక తోట ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల పెరిగిన రేడియేషన్ వల్ల సుమారు 90శాతం తేనెటీగలు అంతరించిపోయినట్లు వివిధ పరిశోధనల ద్వారా రుజువైందని గుర్తు చేశారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటే సహజ సిద్ధమైన తేనెటీగల సంతతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన ఏరియా మేనేజర్ బి.లక్ష్మి నరసింహమూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ శ్రీకాకుళం ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు బి.రామస్వామి, కె.మహేశ్వరరావు, పి.నారాయణరావు పాల్గొన్నారు.

# సమగ్ర కులగణనతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం పీఎన్ కాలనీ: కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల్లో భాగంగా కులాల వారీగా గణన చేపట్టాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వర రావు, చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అనేక కులాలు నేటికీ ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రయోజనం పొందలేదని, వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రక్రియ రాజకీయాలకు అతీతంగా జరగాలన్నారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే కులగణనతో సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

# కల్యాణోత్సవానికి వేళాయె..!

- 23న మొండేటి వీధి వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ వేడుకలు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం



అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్ :

నగరంలోని మొండేటివీధిలో కొలువైన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక కల్యాణ వేడుకలకు సిద్ధమైంది. వందేళ్లుగా నిత్య పూజలందుకుంటున్న ఈ దేవాలయంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. భక్తుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతూ ఆ ప్రాంతవాసులకు ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. సుమారు వందేళ్ల కిందట గైనేటివీధికి చెందిన గుంట కృష్ణవేణి అనే భక్తురాలు ఈ ప్రాంతంలో తొలుత చిన్నపాటి గుడిని ఏర్పాటు చేశారు. ఆలయంలో నిత్య కైంకర్యాల కోసం వైష్ణువులను పూజారులుగా ఏర్పాటు చేశారు. కొంత కాలానికి గుడి జీర్ణావస్థకు చేరింది. 1965లో కొంతమంది యువ భక్తులు కలిసి ఆలయానికి రేకుల షెడ్డును నిర్మించి పూజలు చేయించడం తిరిగి ప్రారంభించారు. 1998లో తంగుడు చంద్రరావు అనే భక్తుడు మరికొందరు భక్తులతో కలిసి ఆలయ పునర్నిర్మాణానికి నడుం బిగించారు. అనంతరం సుమారు రూ.10లక్షలతో భక్తుల సహకారంతో ఆలయానికి గోడలు, శ్లాబ్ వేసి పటిష్టం చేశారు. అర్చకుడిని నియమించి పూజాది కార్యక్రమాలు కొనసాగించడం ప్రారంభించారు. ఇటీవల రూ.15లక్షల ఖర్చుతో ఫ్లోరింగ్, తలుపులు, ఇతర సాకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్తగా సత్యన్నారాయణ స్వామి ఆలయాన్ని కూడా పక్కనే నిర్మించారు. త్వరలోనే ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించనున్నారు. నగరంలో మొదట్లో మూడే వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉండేవని.. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరాలయం, నారాయణ తిరుమల తరువాత ఈ ఆలయం మాత్రమే ఉండేదని చెబుతుంటారు.


**నిత్యపూజలు..**

వేంకటేశ్వరస్వామిరిని నిత్యపూజలతో ఇక్కడి భక్తులు కొలుస్తున్నారు. ప్రతినెల స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం రోజున అలివేలు మంగ పద్మావతి సహిత స్వామివారి కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. తిరుప్పావై ప్రవచనాలు, గోదా రంగనాథుల కల్యాణోత్సవం, ప్రతి శుక్రవారం లక్ష్మీపూజలు, విష్ణు సహస్రనామ పారాయణలు జరుగుతున్నాయి.

**23న వార్షిక కల్యాణోత్సవాలు..**

ఈ నెల 23న ఆలయ వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అర్చకులు, కమిటీ సభ్యులు నిర్ణయించారు. 23న ఉదయం స్వామివారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకాలు, సాయంత్రం 4గంటలకు వైదిక సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుంది.

**పురాతన ఆలయం**



ఆలయంలో ఉన్న స్వామివారి విగ్రహం ఎంతో పురాతనమైనది. కొన్నాళ్లు ఆలనాపాలనా లేకపోవడంతో ఆలయం జీర్ణావస్థకు చేరుకోగా, కొందరు భక్తులు పునరుద్ధరణ చేశారు. అప్పటి నుంచి నిత్య కైంకర్యాలతో పూజలు జరుగుతున్నాయి.

– పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ, అర్చకులు